క్లుప్తంగా

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు



పారిజాతగిరిలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం శనివారం భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగింది. రెండో శనివారం సెలవు దినం కావడంతో విద్యార్థులతో కలిసి వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యారాధన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసే భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతి రాజు, సభ్యులు రెడ్డి రంగ ప్రసాద్ రావు, వాసవి సాయి నగేష్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రవణా నక్షత్ర సందర్భంగా స్వామి వారికి కల్యాణం నిర్వహించనున్నట్లు ఈవో కలగర శ్రీనివాస్ తెలియజేశారు.

ఆంజనేయస్వామికి అభిషేక సేవ



గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో అభిషేక సేవ నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో శనివారం ఆంజనేయస్వామికి అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖమండపం వద్ద ఉత్సవ మూర్తికి అర్చకులు పంచామృత అభిషేకాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.2,36,100 ఆదాయం లభించినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

రేపు సంకష్టహర చతుర్థి పూజలు



అయ్యప్ప ఆలయంలో కొలువైన కన్నెమూల గణపతి

జంగారెడ్డిగూడెం: ఈనెల 14వ తేదీన సంకష్టహర చతుర్థి సందర్భంగా సాయంత్రం 5 గంటలకు గుర్వాయిగూడెం అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఉపాలయమైన కన్నెమూల గణపతికి పంచామృత అభిషేకాలు, అనంతరం గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు చింతాలమ్మకు కుంభాభిషేకం



చింతాలమ్మ అమ్మవారు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామ దేవత శ్రీచింతాలమ్మ తల్లికి ఆదివారం కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటల గంటల నుంచి ఉత్సవ కార్యక్రమాల నిర్వహణకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో మెట్టినింటి నుంచి పుట్టింటికి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించడంతోపాటు మహిళలచే బోనాల సమర్పణ, ఆలయం వద్ద పొంగళ్ళు, నైవేద్యాలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం మహిళలచే అమ్మవారికి గర్భాలయంలో కుంభాభిషేకం చేయనున్నారు.

ఎస్సీ క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలని కతోలి ఎస్సీ, బీసీ కమిషన్ కార్యదర్శి ఫాదర్ ఆంథోని డిమాండ్ చేశారు. ఆగస్టు ఏడో తేదీన నిర్వహించే రాష్ట్రపతి ఆర్డినెన్స్‌పై శనివారం సాయంత్రం స్థానిక నరసింహారావుపేటలోని ఎస్సీఆర్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆంథోని మాట్లాడారు. ఎస్సీ క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలని గత దశాబ్దాలుగా చేస్తున్న పోరాటానికి నేటికీ పరిష్కారం దొరకని పరిస్థితి ఉందన్నారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఎస్సీలు, ఎస్సీ క్రైస్తవులతో భారీ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రం విడుదల చేశారు.

కాంటూర్ లెక్కలతో అందని పరిహారం

- ఆందోళన చెందుతున్న నిర్వాసితులు
- వరదల్లో తమ ఇళ్లు మునిగిపోతున్నాయని ఆవేదన
- తమకూ నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ముంపులో ముందుగా మునుగుతున్నా 45 కాంటూర్ పరిధి అంటూ ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోవడంతో ప్రతి ఏడాది గోదావరి వరదలకు ఇబ్బంది పడుతున్నట్టు కుక్కునూరు నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ప్రారంభానికి ముందు బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురవుతున్న ప్రాంతాన్ని గుర్తించిన అధికారులు ఎఫ్ఆర్ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవల్) స్టోన్‌లను ఏర్పాటు చేశారు. అలా కుక్కునూరు గ్రామంలో



ఎఫ్ఆర్ఎల్ లోపల ఉన్న ఇళ్లు



ఎఫ్ఆర్ఎల్ స్టోన్

శివాలయం పక్కనే ఉన్న ఇళ్లు కూడా ఎఫ్ఆర్ఎల్ పరిధిలో ఉన్నాయి. ప్రతి ఏడాది వరదల సమయంలో గోదావరి వరదకు ఈ ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి.

నిర్వాసిత గ్రామాలకు పరిహారం అందించాలి

రాష్ట్ర విభజన అనంతరం అప్పటి పీఓ మరోసారి ఇళ్లను సర్వే చేసి ఏ, బీ, సీ బ్లాకులుగా విభజించారు. అనంతరం ఏ బ్లాక్ ను 41.15 కాంటూర్ పరిధి అంటూ, బీ ,సీ బ్లాక్‌లను 45 కాంటూర్ అంటూ విభజించారు. ఇటీవల 41 కాంటూర్ పరిధిలోని ఇళ్లకు ఆర్అండ్ఆర్ పరిహారాన్ని కూడా జమచేశారు. కాని ఏ బ్లాక్‌లో ఉన్న ఇళ్లు పూర్తిగా ముంపునకు గురవక ముందే వరద నీటిలో ముంపు గురవుతున్న తమ ఇళ్లు 45 కాంటూర్ పరిధికి చెందినవి అంటూ పరిహారం చెల్లించడం లేదని ఆ ప్రాంత నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు అందించగా ఇరిగేషన్ శాఖకు సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్టు బాధితులు చెప్పారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా ఇరిగేషన్ అధికారులు వచ్చి సర్వే చేసింది లేదని బాధితులు ఆరోపించారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిర్వాసిత మండలాల్లో కాంటూర్ లెక్కలను పక్కనపెట్టి నిర్వాసిత గ్రామాలన్నిటికి పరిహారం అందించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

ఇరిగేషన్ సర్వే రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంది



మా ఇళ్లు దాటిన తరువాతే ఎఫ్ఆర్ఎల్ రాయి ఉంది. ప్రతి ఏడాది గోదావరి వరదలకు ఏ బ్లాక్‌లోని ఇళ్లు పూర్తిగా ముంపునకు గురికాక ముందే మా ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. అయినా మాకు 45 కాంటూర్ అంటూ పరిహారం ఇవ్వడంలేదు. ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి దరఖాస్తు చేశాం. తహసీల్దార్ రిపోర్ట్ కూడా పంపించారు. కానీ ఇరిగేషన్ అధికారులు ఇంతవరకు సర్వే చేయలేదు. వారు సర్వే చేసి రిపోర్ట్ అందిస్తే మాకు న్యాయం జరుగుతుంది.

– దాసరి అప్పారావు, శివాలయం వీధి, కుక్కునూరు

వరద వచ్చినప్పుడల్లా భయమే



గోదావరి నదికి మా ఇళ్లు చాలా దగ్గరగా ఉంటాయి. దీంతో గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా ఇళ్లల్లో ఉండాలంటే భయం వేస్తుంది. మా ఇంటికి దగ్గర్లో ఉన్న పొలాలు ముంపునకు గురవుతున్నాయని పరిహారం ఇచ్చారు. కాని మా ఇళ్లు మాత్రం 45 కాంటూర్ అంటూ పరిహారం ఇవ్వలేదు.

– తంగెళ్లపల్లి కొమరయ్య, శివాలయం వీధి, కుక్కునూరు

ఇదెక్కడి న్యాయం



మా ఇంటి ముందు 10 అడుగుల దూరంలో ఉన్న ఇళ్లకు 41 కాంటూర్ అంటూ పరిహారం ఇచ్చారు. కానీ మా ఇళ్లు 45 కాంటూర్ అంటూ పరిహారం ఇవ్వడం లేదు. ఇదెక్కడి న్యాయం ఇకనైనా ప్రభుత్వం కాంటూర్ లెక్కల్ని పక్కన పెట్టి పరిహారం అందించాలి.

– దాసరి శ్రీను, శివాలయం వీధి, కుక్కునూరు

నిత్యావసరాల అందజేత



బాధితునికి నిత్యావసరాలు అందజేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం

జంగారెడ్డిగూడెం: అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక బాలాజీనగర్‌కు చెందిన వేమన త్రిమూర్తులుకు దాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం నిత్యావసరాలు అందజేశారు. సంఘ వ్యవస్థాపకుడు అమృతల రంగా, గౌరవ అధ్యక్షుడు నేలపోలు ప్రభాకర్ రావు మాట్లాడుతూ దాత గెడ్డం శ్రీనుబాబు ఆర్థిక సహకారంతో 26 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశామన్నారు. అలాగే త్రిమూర్తులకు ఆరోగ్యం నిమిత్తం దాతలు సహకారం అందించాలని కోరారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణ రావు, పఠాన్ బాజీ, ఉపాధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఏలూరు (టూటౌన్): స్థానిక ఆర్ఆర్‌పేటలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 129 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం మందులు ఉచితంగా పంపిణీ చేశారు. శ్రీకృష్ణ ఆస్పత్రిలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ బి.కృష్ణ, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ దిలీప్ తదితరులు సేవలందించారు.

సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

చింతలపూడి: ప్రతి గ్రామాన్ని సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దడానికి పంచాయతీ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో జేఎం రత్నకుమార్ ఆదేశించారు. వెంకటాపురంలో శనివారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తడిచెత్త, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న చెత్తకుప్పలు, పెంట కుప్పలను తొలగించాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వర్షాకాలం జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆదేశించారు.



వెంకటాపురంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పంచాయతీ సిబ్బందితో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండి అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కూటమి నాయకులను నిలదీయండి

కామవరపుకోట: సూపర్ సిక్స్ పథకాలతో అబద్ధపు హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిన కూటమి నాయకులను నిలదీయాలని చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాలలో మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు ఏ విధంగా మోసం చేశారో వివరించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను, ఉచిత బస్సు పేరుతో మహిళలను మోసం చేశారన్నారు. కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో పాటు ఇంకా అనేక హామీలను కూటమి ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. కనుక కూటమి నాయకులు గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని తెలిపారు. అనంతరం కొల్లివారిగూడెంలో మొక్కపాటి వీరా రాఘవులు కుటుంబ సభ్యులు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను, జలపువారిగూడెంలో ప్రమాదవశాత్తు గాయాలైన డాబా సుబ్బారెడ్డిని, పాము కాటు గురైన కొవ్వలి చంద్రమౌళిని, ఇటీవల మృతి చెందిన కనమతరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను, ఉప్పలపాడులో దోరేపల్లి వీర బ్రహ్మం తండ్రి నారయ్య మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నబాబు, దేవరపల్లి రామ్మోహన్‌రావు, నానాది సాగర్, గుర్రాల రవికుమార్, ఉప్పలపాడు మోహన్‌రావు, వెర్రి శ్రీను, మెరుగు బాబురావు, చింతలబోయిన సుబ్రహ్మణ్యం, పరస మోహన్, మద్ది రామయ్య, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జీలకరగ్రూడెంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయరాజు

గర్భిణీ స్త్రీలకు కేన్సర్ వ్యాక్సినేషన్

కొయ్యలగూడెం: గర్భిణీ స్త్రీలకు కేన్సర్‌పై అవగాహన కల్పించడంతోపాటు నివారణకు ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం కూడా రోటరీ క్లబ్ ద్వారా ప్రస్తుత సంవత్సరంలో అమలు చేయనున్నట్లు క్లబ్ గవర్నర్ కె.చక్రవర్తి పేర్కొన్నారు. 2025–26 సంవత్సరానికి గాను కొయ్యలగూడెం క్లబ్ నూతన కార్యవర్గ ఇన్‌స్టలేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి సంవత్సరం ఓ సేవా కార్యక్రమాన్ని అమలు చేస్తూ క్లబ్ ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లుగానే ఈ సంవత్సరం గర్భిణీ స్త్రీల కేన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిగణనలోకి తీసుకున్నామన్నారు. కల్పవృక్షం వృద్ధాశ్రమాన్ని రోటరీ క్లబ్ నిర్వహిస్తూ ఎంతో మంది వృద్ధుల జీవితాలకు వెలుగునిస్తోందని ఆయన అభినందించారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా మాజేటి సత్యనారాయణ, కార్యదర్శిగా కని



కార్యక్రమంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు

గళ్ళ సతీష్ శ్రీరామచంద్ర మూర్తి, నూతన సభ్యులకు ఇన్‌స్టలేషన్ కార్యక్రమాన్ని అసిస్టెంట్ గవర్నర్ అల్లూరి విశ్వనాథ శర్మతో కలసి నిర్వహించారు. అనంతరం ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నూతన సభ్యులను అభినందించారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన క్లబ్ సభ్యులను సన్మానించారు.

వానలు రాక.. మెట్టలో దిగాలు



చింతలపూడిలో నాట్లు వేయడానికి సిద్ధం చేసిన భూములు




మెట్ట ప్రాంతంలో ఏపుగా ఎదిగిన నారుమడి, ముదిరిపోతున్న నారు

- ముందుకు సాగని వ్యవసాయ పనులు
- పూర్తి కాని నాట్లు, ఆందోళనలో రైతన్నలు

చింతలపూడి: జోరుగా వ్యవసాయం సాగాల్సిన ప్రస్తుత తరుణంలో వానలు రాక మెట్ట రైతులు దిగులు చెందుతున్నారు. దుక్కులు దున్ని, నేలను చదును చేసుకుని ఖరీఫ్ వ్యవసాయానికి సిద్ధంగా ఉన్న రైతులకు వర్షాలు వెనుకబడటం నిరాశను మిగిల్చాయి. సబ్‌డివిజన్ పరిధిలోని చింతలపూడి నియోజకవర్గంలో 18,384 హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 7,603 హెక్టార్లు, లింగపాలెం మండలంలో 3,072 హెక్టార్లు, కామవరపుకోట మండలంలో 2,457 హెక్టార్లు, జంగారెడ్డిగూడెం మండలంలో 5,252 హెక్టార్లలో వరి పంటను సాగు చేస్తారు. ప్రతి ఏటా రైతులు ఈ పాటికి 50 శాతం వరి నాట్లు పూర్తి చేసేవారు. కానీ సాగు నీటి ఇబ్బందుల దృష్ట్యా ఇప్పటివరకు 25 శాతం నాట్లు కూడా పూర్తికాలేదు. ఆకుమడి వేసిన 30, 35 రోజుల్లో నాట్లు వేయడం పూర్తి చేస్తే దిగుబడి బాగా వస్తుందని, వర్షాభావ పరిస్థితుల కారణంగా నాట్లు వేయడం ఆలస్యమయ్యేలా ఉందని అంటున్నారు. వర్షాలు ఆలస్యం కావడంతో ఆగస్టు నెలాఖరు వరకూ నాట్లు వేయడం కొనసాగేలా ఉందని మెట్ట రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా మెట్ట ప్రాంతానికి శాశ్వత సాగు నీటి వసతులు కల్పించడానికి నేతలు కృషి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత సాగు నీరు ఒక్కటే మార్గం



మెట్ట ప్రాంతానికి శాశ్వత సాగు నీరు ఒక్కటే మార్గం. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయితే మెట్ట ప్రాంతంలో సాగు నీటి ఇబ్బందులు తొలగిపోతాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ.1,931 కోట్ల నాబార్డు రుణం మంజూరైంది. ఆ నిధులతో తక్షణం పథకాన్ని పూర్తి చేసి రైతులకు గోదావరి జలాలను శాశ్వతంగా అందించాలి.

కంభం విజయరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్

వరద బాధితులకు సహాయ పునరావాస కార్యక్రమాలు

కుక్కునూరు: గోదావరి వరద ముంపు ప్రమాద మండలాల్లోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలోని వరద ముంపు బాధితులను దాచారంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన వరద పునరావాస శిబిరానికి తరలించి, ప్రజలకు భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, ఆర్డీవో ఎంవీ రమణ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. కుక్కునూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వరద ప్రమాద హెచ్చరికపై టాంటాం చేస్తూ, మండలంలోని ప్రజలు గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లా సర్వే అధికారి అన్సారీ, తహసీల్దార్ కె.రమేష్ కుమార్, రెవెన్యూ, పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల సిబ్బంది పునరావాస కార్యక్రమంలో పాల్గొన్నారు.



దాచరం ఆర్అండ్ఆర్ కాలనీలో పర్యటిస్తున్న ఆర్డీవో ఎంవీ రమణ

పర్యావరణంపై బాలలకు అవగాహన

కొయ్యలగూడెం: చిన్నతనం నుంచి విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి చిడిపి రవి పేర్కొన్నారు. శనివారం కార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన పర్యావరణ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్డ్స్ సంస్థ ఏరియా కోఆర్డినేటర్ అపర్ణ విద్యార్థులకు పర్యావరణం గురించి అవగాహన కల్పించి వారి చేత డెమో కార్యక్రమాలు చేయించి ఉత్సాహపరిచారు. అంకాల గూడెం, మంగపతి దేవి పేట, రాజవరం, పొంగుటూరు, యర్రంపేట, ధర్మారావుపేట, గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించి కేక్స్ కట్ చేసి స్వీట్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అమరావతి, సత్యవతి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మారావుపేటలో పర్యావరణంపై బాలలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాల యోధుల చరిత్ర తెలుసుకోవాలి

ఏలూరు (టూటౌన్): భారతదేశ చరిత్రలో మాల యోధుల విశిష్టత మేధావుల పాత్ర చాలా ఘనమైనదని దళిత సాహిత్య పరిశోధక గ్రంథ రచయిత రిటైర్డ్ కమర్షియల్ ట్యాక్స్ స్టేట్ ఆఫీసర్ బొనిగల రామారావు అన్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నేతల రమేష్ అధ్యక్షతన శనివారం ఏర్పాటుచేసిన భారత దేశ చరిత్రలో మాల యోధుల విశిష్టత, మేధావుల పాత్రపై సెమినార్‌లో రామారావు మాట్లాడారు. ప్రాచీన భారతదేశ చరిత్రలో మాలయోధులు మాల మేధావులు నిర్వహించిన పాత్ర అమోఘమైనదన్నారు. గత చరిత్రను యువత తెలుసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. చారిత్రక ఆధారాలతో పురాతన గ్రంథాల్లో ఉన్న అనేక అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, జేఏసీ చైర్మన్ చాగంటి సంజీవ్, ఏలూరు కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, పల్లెం ప్రసాద్, డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్, దాసరి నాగేంద్ర కుమార్, అలుగు ఆనంద శేఖర్, ఎరికిపాటి విజయ్, కాపుదాసి రవి, గొల్ల కిరణ్, కర్నకోటి దిలీప్, పాము రవీంద్ర, దోమతోటి అబ్రహం, గంజి మధు, సీహెచ్ సాయిరాజ్, దాసి వెంకటేశ్వర్లు కర్రే అంబేద్కర్, గుదే రాంబాబు, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, మాదేపల్లి సర్పంచ్ కొరపాటి బాబు, తేరా ఆనంద్, పాము శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న రిటైర్డ్ ఏసీటీఓ రామారావు

మధ్యాహ్న భోజన వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

కుక్కునూరు: మధ్యాహ్న భోజన వర్కర్లు, స్కూల్ స్వీపర్ల సమస్యలను పరిష్కరించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. ఆయా సంఘాల సమావేశం స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం జరిగింది. సాయికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం, పాఠశాల పరిసరాల శుభ్రత కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మిడ్ డే మీల్ వర్కర్లు, స్వీపర్లు చాలిచాలనీ గౌరవ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంటకు అవసరమైన గ్యాస్ సిలిండర్, మెనూ వస్తువులు ప్రభుత్వమే సప్లయి చేయాలని, స్కూల్ స్వీపర్లకు గ్లౌజ్‌లు, మాస్కులు, చీపుర్లు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాక వీరికి బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అక్రమ తొలగింపులకు స్వస్తి పలికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మిడ్ డే మీల్ వర్కర్స్ నాగలక్ష్మి, కీర్తి, రత్తమ్మ, లక్ష్మి స్కూల్ స్వీపర్లు కమల, మహాలక్ష్మి, మేఘనా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలతోనే భవిష్యత్తు

దెందులూరు: అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఐదేళ్ల లోపు వారందరికీ విధిగా తల్లిదండ్రులు టీకాలు వేయించాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు రాకేష్, రోజు మేరీ అన్నారు. శనివారం గోపన్నపాలెం పీహెచ్‌సీ పరిధిలో సబ్ సెంటర్‌లో చిన్నారులకు టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోకుండా నిర్లక్ష్య వైఖరితో ఉంటే చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తల్లిదండ్రులు చిన్నారుల ఆరోగ్యంతో పాటు తమతమ ఆరోగ్యాల సంరక్షణలో కూడా వ్యక్తిగత బాధ్యతలు తీసుకోవాలన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం తదితర ఏజెన్సీ మండలాల్లోని అనేక గ్రామాల్లో వెంటనే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా అనుబంధ, ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు సోడే విజయ, కార్యదర్శి ఎస్‌కే మున్ని డిమాండ్ చేశారు. శనివారం మద్దిగట్లలో జరిగిన ఏలూరు జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. అలాగే అనేక గ్రామాల్లో ఫ్లూ, టైఫాయిడ్ జ్వరాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, మలేరియా జ్వరాలకు టాబ్లెట్లు ఇవ్వడం వరకు పరిమితం కాకుండా వైద్య ఆరోగ్య మలేరియా శాఖ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక కేంద్రాల్లో, హెల్త్ క్యాంపుల్లో రోగులకు మలేరియా నిరోధక ఇంజక్షన్‌లు ఇవ్వాలన్నారు. హాస్పిటల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులు భర్తీ చేయాలని, ప్రస్తుతం గోదావరి వరదల సమయంలో పునరావాస కేంద్రాల్లో వెళ్లిన నిర్వాసితులకు అన్ని గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు, నార్లవరం ఎంపీటీసీ కట్టం రత్తమ్మ, కారం సత్యవతి, మడివి కన్నమ్మ, తొడం సీత, గడ్డల రమణ, రమణ తదితరులు పాల్గొన్నారు.